

బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో మూసాపేట్‌లో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ తదితరులు.
- కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

అపార్ట్‌మెంట్‌లకు ఒకేచోట డస్ట్ బిన్ ఉండాలి

- గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో డోర్ టూ డోర్ తిరగకుండా ఒకేచోట డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేస్తే చెత్త సేకరణ సులభతరమవుతుందని, అందుకోసం అపార్ట్‌మెంట్ అసోసియేషన్లను సంప్రదించి బిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆమ్రపాలి అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లలో చెత్తసేకరణ వివిధ కారణాలతో పూర్తి స్థాయిలో స్వచ్ఛ ఆటోలకు రావడం లేదని, డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడం వల్ల చెత్తను స్వచ్ఛ ఆటోలో తీసుకునేందుకు సులభతరమవుతుందని అన్నారు. పార్కుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా డస్ట్‌బిన్లు ఉండాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వివరాల నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంక్షన్ల వద్ద వాహనదారులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా పూల మొక్కలు ఏర్పాటు చేయాలని యూబీడీ అధికారులకు సూచించారు. పశువులు రోడ్లపై సంచరించకుండా క్షేత్ర స్థాయి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

నేడు ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. జె గ్రూప్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందని, ఆసక్తి కలిగిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగవైకల్యం, కాలిన గాయాలకు చికిత్స

జీడిమెట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం, కాలిన గాయాలు, కణితలు, వంకర కాళ్లు వంటి సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు కూకట్‌పల్లి ఆకార్ ఆషా ఆసుపత్రి వారి సహకారంతో చికిత్స అందించనున్నట్లు జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ తెలిపారు. కాలనీ అధ్యక్షులు, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లు, యువకులు ఎవరైనా పలు సమస్యలతో బాధపడే వారిని గుర్తించి సమాచారం అందించాలని కోరు. - 94906 17157, 87125 68311లలో సంప్రదించాలని కోరారు.

ఎన్ఎండీసీ డైరెక్టర్‌గా జాయ్‌దీప్ దాస్ గుప్తా !

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) ప్రొడక్షన్ డైరెక్టర్‌గా జాయ్‌దీప్ దాస్ గుప్తా పేరును పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలెక్షన్ బోర్డు సిఫారసు చేసింది. జాయ్‌దీప్ దాస్ గుప్తా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అయితే, న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలెక్షన్ బోర్డు సమావేశంలో జాయ్‌దీప్ నియామకంపై చర్చించారు. అలాగే, ఎన్ఎండీసీ ఛైర్మన్ అమితవ్ ముఖర్జీపై లోక్‌పాల్ లో జరుగుతున్న విచారణపైనా బోర్డు చర్చించింది. అమితవ్ ముఖర్జీపై చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సమర్పించేందుకు ఫిర్యాదుదారుడికి బోర్డు రెండు వారాలు గడువిచ్చింది.

హిమాలయాల్లో భూకంప ప్రమాద అధ్యయనానికి

- సీఎస్ఐఆర్, ఎన్ఆర్ఎస్‌సీ అవగాహన ఒప్పందం

ఉప్పల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హిమాలయా శ్రేణులలో భూకంపానికి కారణమయ్యే వివర్తనిక వికృతిపై విస్తృతమైన అధ్యయనం చేసేందుకు జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (సీఎస్ఐఆర్), భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థకి చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం (ఎన్ఆర్ఎస్‌సీ) అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ మేరకు మంగళవారం సీఐఎస్ఐఆర్- ఎన్జీఆర్ఐ సంచాలకులు డా. ప్రకాష్ కుమార్, జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం ఉప సంచాలకులు డా. కె. శ్రీనివాస్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థల మధ్య ఒప్పందం రాబోయే మూడు సంవత్సరాల పాటు కొనసాగనుందని అధికారులు తెలిపారు. భూకంప ప్రమాద మూల్యాంకనం కోసం పశ్చిమ హిమాలయాల్లో భూపటల విరూపణం యొక్క అధిక - రిజల్యూషన్ చిత్రాలను గణించడానికి నిరంతర జీపీయస్ పరిశీలనలు, ఉపగ్రహ ఆధారిత పరిశీలనల ద్వారా భూమిలో కొలిచే భూపటల విరూపణంపై సమాచారాన్ని ఉపయోగిస్తాయి.



నాగమణికి నియామక పత్రాన్ని అందజేస్తున్న జె.కె శేఖర్‌యాదవ్

కుత్బుల్లాపూర్ మహిళా మోర్చా కన్వీనర్‌గా నాగమణి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ మహిళా మోర్చా కన్వీనర్‌గా జీడిమెట్లకు చెందిన ముధునూరి నాగమణి మంగళవారం నియమితులయ్యారు. ఈ నియామక పత్రాన్ని మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఆమెకు పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీని బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రాయదుర్గం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశానికి గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వచ్చిన, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి, ఏపీసీ ఛైర్మన్ వీణ, ఉపాధ్యాయులు వెంకట్‌రామ్‌రెడ్డి, హమీద్, రామచందర్, శ్రీలత, జ్యోతి పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో కాలనీలకు మౌలిక సదుపాయాలు

హైదర్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యత క్రమంలో కాలనీలో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ వాంబేకాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

గౌలిదొడ్డి గురుకులంలో జీతాలివ్వండి

సీఎం విదేశీ టూర్లకే నిధులిస్తారా..? : ఆర్ఎస్ ప్రవీణ్

హైదరాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ ప్రమాణాలతో విద్యను బోధిస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న గౌలిదొడ్డి గురుకుల కళాశాలలో.. అధ్యాపకులకు మూడున్నర నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇది బీఆర్ఎస్ సర్కారు అభివృద్ధి చేసిన గురుకులాలు.. దళిత, ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థుల మీద కాంగ్రెస్ సర్కారు చేస్తున్న కుట్ర అని విమర్శించారు. సమ్మె చేస్తున్న ఆ అధ్యాపకులకు వెంటనే జీతాలు చెల్లించాలని మంగళవారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఒకప్పుడు ప్రపంచ స్థాయి విద్యాలయాలుగా ఉన్న గురుకులాలు ఇప్పుడు మృత్యు కుహరాలుగా మారాయని అన్నారు. సీఎం విదేశీ పర్యటనలు, విలాసాలకే కాకుండా గురుకుల టీచర్లకు జీతాల కోసం కూడా నిధులివ్వాలని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కోరారు.

జంట సర్కిళ్ల పరిధిలో రెండు భవనాలు సీజ్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని బఫర్ జోన్, నాలా స్థలాలను ఆక్రమించి నిర్మిస్తున్న రెండు భవనాలను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్ ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం సీజ్ చేశారు. సుభాష్‌నగర్ గంపలబస్తీ సమీపంలోని ప్లాట్‌నెంబర్-47లో కోల్‌నాలా బఫర్‌జోన్‌ను ఆక్రమించి నిర్మిస్తున్న భవనాన్ని కుత్బుల్లాపూర్ సర్కిల్ డీసీ నర్సింహ ఆధ్వర్యంలో సీజ్‌చేశారు. అదే విధంగా గాజులరామారం కైసర్‌నగర్ ప్రాంతంలోని సర్వేనెంబర్ 329లో గల ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాన్ని డీసీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ప్రతీరోజు బఫర్‌జోన్, నాలా ఆక్రమణలను గుర్తించి సీజ్ చేసి కూల్చివేతలు చేపడతామని జోనల్ కమిషనర్ తెలిపారు.



గాజులరామారం కైసర్‌నగర్‌లో సీజ్ చేసిన భవనం

యువతి అదృశ్యం



సాయిశ్రావణి

రాయదుర్గం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి గుల్‌మొహర్ పార్కు కాలనీకి చెందిన శ్రీరాములు కూతురు సాయిశ్రావణి(19) మంగళవారం ఇంటి నుంచి బయటకువెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్‌గౌడ్ తెలిపారు.

అవయవాలు లభించక ప్రాణాలు పోతున్నయ్

యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవసరం మేరకు అవయవాలు లభించక దేశవ్యాప్తంగా మూడు లక్షల మందికిపైగా మరణిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయని యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు. అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 'సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ సే' కార్యక్రమంలో గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్ మార్పిడి చేసుకుని పునర్జన్మ పొందిన రోగులతో ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. మార్పిడి చేసుకున్న తరువాత వారి జీవనశైలి ఎలా ఉంటుంది, ట్రాన్స్‌ప్లాంట్‌కు ముందు వారు అనుభవించిన అనారోగ్య సమస్యలు.. అవయవ మార్పిడి తరువాత వారు అనుభవిస్తున్న (క్వాలిటీ లైఫ్) మెరుగైన జీవన విధానం ఎలా ఉంటుందనే దానిపై ప్రస్తుతం ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నవారు పడే ఆందోళన, అపోహలను తొలగించి అవయవ మార్పిడి ద్వారా జీవితాలను ఎలా కాపాడుతుందో అనే అంశాలను ఈ కార్యక్రమంలో వివరించినట్లు ఆయన చెప్పారు. బ్రెయిన్ డెడ్ కేసులకు సంబంధించి అవయవాల దానం ప్రస్తుతం ఉన్న 0.36 రేటు నుంచి స్వల్పంగా పెరిగి 1కి చేరుకున్నా, రెట్టింపు సంఖ్యలో వ్యాధిగ్రస్థుల ప్రాణాలు నిలుస్తాయన్నారు. దేశంలోనే అత్యధికంగా ప్రతీ పది లక్షల జనాభాకు అయిదు మంది వరకూ అవయవదానం చేస్తున్నారని డాక్టర్ పవన్ గోరుకంటి అన్నారు. మన రాష్ట్రానికి చెందిన 'జీవన్‌దాన్' దేశంలో క్రియాశీల కార్యక్రమాలలో ఒకటిగా గుర్తింపు లభించిందని, రాష్ట్రంలో అవయవదానాల సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. ఇప్పటికే అవయవదానాల ద్వారా ప్రజల ఆయుష్షును పెంచే రాష్ట్రంగా దేశంలోనే తెలంగాణ అగ్రస్థానానికి చేరుకున్నదని, దీనివల్ల అవయవమార్పిడి సర్జరీల నిర్వహణ కేంద్రంగా హైదరాబాద్ నగరం దేశంలోనే ప్రధాన నగరంగా మారిందన్నారు. సికింద్రాబాద్ యూనిట్ హెడ్, డాక్టర్. విజయ్‌కుమార్, మాట్లాడుతూ సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ కార్యక్రమం మరణం తర్వాత ఒక వ్యక్తి తన అవయవాలు దానం చేయడంవల్ల ఎంత మందికి కొత్త జీవితాన్ని ఇవ్వొచ్చని తెలియజేసే గొప్ప రిమైండర్ కార్యక్రమన్నారు.



'సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ సే' కార్యక్రమంలో వైద్యులు, పేషంట్లు



చేపల మార్కెట్‌ను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న బండి రమేష్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. ఈ మేరకు చేపల మార్కెట్, ఎంఐజీ ఇళ్లమధ్యలో వైన్‌షాపు, గోపాల్‌నగర్‌లో పార్కు స్థలం సందర్శించారు. చేపల మార్కెట్‌లో 86 స్టాల్స్ ఉండగా.. కేవలం 36 మాత్రమే నడవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. చేపల మార్కెట్‌లో టిఫిన్ సెంటర్‌న ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. తక్షణమే పాత కమిటీని రద్దుచేసి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, దిండి అరవింద్‌రెడ్డి, ఫణీంద్ర, శివ చౌదరి, బచ్చు నాగమల్లేశ్వరరావు, మైకేల్, పొడుగు అప్పారావు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌నగర్‌లో నిర్మాణం పూర్తైన సీసీ రోడ్డును కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా వద్ద మట్టి వేయాలని, సక్రమంగా క్యూరింగ్ చేయాలని అధికారులకు సూచించారు. సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, యాదగిరి, అగ్రవాసు, సంగమేష్, రవీందర్, అజామ్, బుజమ్మ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

- వివేకానందనగర్ డివిజన్ హనుమాన్ ఈనాడు కాలనీలో మంజూరైన సీసీ రోడ్లను అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మంగళవారం పరిశీలించారు. రోడ్డు పనులు వీలైనంత త్వరగా ప్రారంభించి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఆశ, హెచ్‌డబ్ల్యూఎస్ మేనేజర్ ప్రియాంక, నాయకులు విఠల్, నరసింహ, ఎర్రన్న, టైల్ శీను, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి కృషి చేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మియాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన కార్పొరేటర్ హమీద్‌పటేల్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ నూతన అధ్యక్షుడు విజయ్, కార్యవర్గ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోటి కుంకుమార్చన

చందానగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పా ఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో కోటికుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ఛైర్మన్ యువీ రమణమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు

రాంగోపాల్‌పేట్: ఈనెల 22న స్వయంగా మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని వేణుస్వామికి తెలంగాణ మహిళా కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఇటీవల సినీ నటుడు అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తెలుగు ఫిల్మ్ జర్నలిస్టుల అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుకు స్పందించిన ఛైర్‌పర్సన్ వేణుస్వామికి నోటీసులు జారీ చేసింది.

'ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా'

గాజులరామారం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలని షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సమస్యలను పరిష్కరించాలని కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర

హైదర్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ కాలనీ ఫేజ్-1లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఇంటింటికి వెళ్లి తెలుసుకున్నారు. త్వరలోనే కాలనీలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు డీఈ రమేష్, ఏఈ రాజీవ్, మేనేజర్ ప్రశాంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ, హార్టికల్చర్ దాసు, డ్రైనేజీ సూపర్‌వైజర్ ఓంప్రకాశ్, లైన్‌మెన్ వెంకటేష్, ఎస్ఎఫ్ఏ రమణ, స్థానికులు ఉన్నారు.

బంగ్లాదేశ్‌లో శాంతిని నెలకొల్పాలి



కేపీహెచ్‌బీలో ర్యాలీలో పాల్గొన్న మాధవరం కాంతారావు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో శాంతి నెలకొల్పడానికి ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆ పార్టీ బాలాజీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కర్ర వేణుగోపాల్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మంగళవారం రాత్రి కేపీహెచ్‌బీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కరవైందని, దాడులను అరికట్టాలని తక్షణమే ఐక్యరాజ్య సమితి దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్వ పవన్, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లారెడ్డి

గాజులరామారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త, నాయకులు కృషి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్‌లోని యండమూరి లే-అవుట్ కమ్యూనిటీహాల్లో కార్యకర్తల డివిజన్ సమావేశం నాయకులతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను ప్రజలు దీవించి, బీజేపీకి పట్టం కట్టి పార్టీని ఆశీర్వదించారని రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్, కార్పొరేటర్ రావుల శేషగిరి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జోయెల్ డేవిస్, ఎన్.భవాని, ఫినిక్స్ సంస్థ ప్రతినిధులు

'ఫినిక్స్' ఆధ్వర్యంలో రక్తదానం

రాయదుర్గం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌తో కలిసి ఫొనిక్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక రోజు, వ్యవస్థాపకుడు స్వర్గీయ చుక్కపల్లి శంకరరావు స్మారకార్థం మంగళవారం నానక్‌రాంగూడలోని ఫినిక్స్ అక్విలాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్, విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎస్.భవాని, ఫినిక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గోపీకృష్ణ పాటిబండ, డైరెక్టర్ శ్రీకాంత్ బాడిగ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. అనంతరం భవాని మాట్లాడుతూ రక్తం అనేక సంక్లిష్ట భాగాలతో నిర్దిష్ట విధులు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కటి సరిగ్గా పునరుత్పత్తి చేయడం చాలాకష్టమన్నారు. మానవ శరీరం రక్తాన్ని తయారు చేస్తుందని, దానికి ప్రత్యామ్నాయం లేదన్నారు. రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, టేబుల్ టెన్నీస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో వ్యక్తి ప్రాణం కాపాడారు

జీడిమెట్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆచూకీని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించి అతని ప్రాణాన్ని కాపాడారు జగద్గిరిగుట్ట పోలీసులు. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బీరప్పనగర్‌కు చెందిన మూలంపాక బాబీ (28) సోమవారం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. కొంత సేపటి తర్వాత తన బావమరిదికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి స్విచ్ఛాఫ్ చేశాడు. వెంటనే అతడి భార్య జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించగా సీఐ క్రాంతికుమార్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సికింద్రాబాద్ మహాకాళి ప్రాంతంలోని ఓ లాడ్జీలో దోమలమందు తాగి పడి ఉన్న బాబీని గుర్తించారు. వెంటనే చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబీ

దౌర్జన్యంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించిన బీజేపీ నేతలు

జీడిమెట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల మధ్య షాపూర్‌నగర్‌లో పాదచారుల కోసం నిర్మించి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని మంగళవారం ఉదయం బీజేపీ నాయకులు ప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయి సంవత్సరం అయినా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో బీజేపీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్‌ల నాయకత్వంలో తరలివచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. జీహెచ్ఎంసీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లారెడ్డి, జేకే.శేఖర్‌యాదవ్‌లు మాట్లాడుతూ.. కొందరు రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం బ్రిడ్జిని ప్రారంభించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతంలో తమ బంధువుల ఇళ్లు పోతున్నాయని బ్రిడ్జిని ఈ ప్రాంతానికి మార్పించిన నాయకులు కనీసం ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా జీడిమెట్ల ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు బందో బస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరివర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ రావులశేషగిరి, పొన్నారెడ్డి, సుధా, అరుణారెడ్డి, ఝాన్సీ, బలరాం పాల్గొన్నారు.



ఎస్కలేటర్‌పై వస్తున్న బీజేపీ నాయకులు

విద్యాశాఖలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదు

ఉపాధ్యాయులకే పదోన్నతులు ఇవ్వాలి

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదని, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్, జూనియర్ కాలేజీ లెక్చరర్ తదితర పోస్టులను పదోన్నతి ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు టి.ప్రకాష్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ కలీల్ అహ్మద్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా విద్యాశాఖలో పని చేస్తున్న సుమారు 12 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావల్సిన పదోన్నతులు రాలేదని అన్నారు. గత ప్రభుత్వాలు ఉమ్మడి సర్వీస్ రూల్స్ పేరుతో జీవోలు తెచ్చి ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కలిపి ఇవ్వడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆ జీవోలపై తాము రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఉమ్మడి సర్వీస్ రూల్స్ చెల్లదని తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని అన్నారు. అన్ని మండలాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించి ఎంఈఓలుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వై. కృష్ణారావు, పోశం కృష్ణమూర్తి, శ్రావణ్ కుమార్, సైదుల్ రెడ్డి, సంపత్ కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాసం ప్రభాకర్